


**రఘునాథపాలెం, కెరటం న్యూస్**



రాష్ట్ర ప్రభుత్వం భూమి శిస్తు విధానాన్ని తిరిగి అమలు చేయాలనే ఆలోచన రైతాంగ వ్యతిరేక చర్య అని సీపీఎం రఘునాథపాలెం మండల కార్యదర్శి ఎస్. నవీన్ రెడ్డి తీవ్రంగా విమర్శించారు. ఇప్పటికే అప్పుల ఊబిలో కూరుకుపోయిన రైతులపై మరో ఆర్థిక భారం మోపేందుకు ప్రభుత్వం సిద్ధపడటం దుర్మార్గమని అన్నారు. పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించడంలో, రైతుల రుణ సమస్యలను పరిష్కరించడంలో, సాగునీటి సమస్యలను తీర్చడంలో విఫలమైన ప్రభుత్వం ఇప్పుడు భూ ఆక్రమణల పేరుతో భూమి శిస్తును తిరిగి తీసుకురావాలని చూడటం రైతాంగాన్ని మరింత ఇబ్బందుల్లోకి నెట్టడమేనని పేర్కొన్నారు. భూ ఆక్రమణలను అరికట్టడం ప్రభుత్వ బాధ్యత. అందుకోసం రెవెన్యూ వ్యవస్థను బలోపేతం చేయాలి, భూ రికార్డులను పారదర్శకంగా నిర్వహించాలి. కానీ ప్రభుత్వ వైఫల్యాలకు రైతులను బలిపశువులను చేయడం ఏ మాత్రం సమంజసం కాదు. భూ హక్కుల రక్షణ పేరుతో పేద, చిన్న, సన్నకారు రైతులపై పన్నుల భారం మోపడం రైతాంగ వ్యతిరేక విధానానికి నిదర్శనమని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులకు ఇచ్చిన హామీలను పూర్తిగా అమలు చేయకుండా కొత్త కొత్త భారాలను మోపే చర్యలకు పాల్పడుతోందని ఆరోపించారు. రైతుల సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టాల్సిన ప్రభుత్వం, ఆదాయ వనరుల కోసం రైతుల జేబులపై కన్నేయడం సిగ్గుచేటని అన్నారు. భూమి శిస్తు విధానాన్ని వెంటనే విరమించుకోవాలని, రైతుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని నిర్ణయాలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రైతాంగాన్ని సమీకరించి ఆందోళన కార్యక్రమాలు చేపడతామని సీపీఐ(ఎం) నేత నవీన్‌రెడ్డి హెచ్చరించారు.